క్లుప్తంగా

ఘనంగా సాయినాధునికి పూజలు



పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో జ్యేష్ఠ మాసం చివరి గురువారాన్ని పురస్కరించుకుని అర్చకులు పావులూరి శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలురకాల పువ్వులతో బాబాని ప్రత్యేకంగా అలంకరించారు. బాబా వారికి కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆవుపాలతో, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వినోద్ తెలిపారు. షిర్డిసాయి భక్త మండలి సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సాంబశివరావు, మధుసూదనరావు, రాధాకృష్ణ, సురేష్, అప్పయ్య, రమేష్, సాయి పాల్గొన్నారు.

3071మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మొవ్వ: మండలానికి రెండోవిడత వచ్చిన పాఠ్యపుస్తకాలను ఆయా స్కూల్‌కాంప్లెక్స్‌ల సీఆర్పీల పర్యవేక్షణలో ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివశంకర్, కె.శ్రీలక్ష్మి గురువారం తెలిపారు.మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం 3071 బ్యాగులు, 3091 జతల షూస్ వచ్చినట్లు వివరించారు. ఈవిద్యా సంవత్సరంలో 3071మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించినట్లు వివరించారు. ఈ ఏడాది జాయిన్ అయిన 485 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈవోలు తెలిపారు.

గ్రామసభల షెడ్యూల్ అందజేత



మండవల్లి: జూలై 1వ తేదీ నుంచి జరిగే గ్రామసభల షెడ్యూల్‌ను ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు, ఐక్యవేదిక జిల్లా సభ్యులకు గురువారం అందజేశారు. గ్రామసభ షెడ్యూల్ త్వరితగతిన తయారుచేసి అందజేయాలని, అధికారులంతా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు ఇటీవల 'మీకోసం'లో అర్జీ అందజేశారు. దీంతో స్పందించిన ఈఓపీఆర్డీ ఆనందబాబు గ్రామసభల షెడ్యూల్ తయారుజేసి వారికి అందించారు. షెడ్యూల్‌ను అందజేయడంపై ఐక్య వేదిక జిల్లా సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధులను అందరూ గౌరవించాలి



పెరిశేపల్లి(పామర్రు): వృద్ధులు దైవంతో సమానమని, ప్రతిఒక్కరూ వృద్ధులను గౌరవించాలని కృష్ణా ఫౌండేషన్ వృద్ధ శరణాలయ నిర్వహకులు సామూరి రాంబాబు, ఝాన్సీ పేర్కొన్నారు. పెరిశేపల్లిలోని చెరుకూరి కృష్ణమూర్తి మంజుల దంతులచే నిర్మించిన కృష్ణా ఫౌండేషన్ వృద్ధ శరణాలయంలో గురువారం వృద్ధ మహిళలచే సామూహిక లలిత పారాయణం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు ప్రశాంతమైన వాతావరణంలో ఆశ్రమం నిర్మించామని అన్నారు. ఆశ్రమంలో వృద్ధుల కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు



బి.దుర్గానాగసాయి



కె.శ్రీవల్లి

కైకలూరు: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో బి.దుర్గానాగసాయి 453 మార్కులతో మొదటి స్థానం సాధించగా, బి.రోహిత్ కృష్ణ 425 మార్కులతో ద్వితీయ స్థానం సాధించాడు. ఫస్టియర్ బైపీసీలో కె.శ్రీవల్లి 400 మార్కులతో ప్రథమ స్థానం, బి.సంజయ కుమారి 399 మార్కులతో ద్వితీయ స్థానం, ఒకేషనల్ ఓఏ గ్రూప్‌లో జి.శ్రావణి 458 మార్కులతో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభచూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, సిబ్బంది గురువారం అభినందించారు.

ఉల్లి ఘాటు...కూరగాయల పోటు

- చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు
- రూ.70కి చేరిన క్యారెట్
- రూ.60 పలుకుతున్న బీరకాయలు
- ఆందోళనలో ప్రజలు
- ధరలు తగ్గించాలని డిమాండ్



పామర్రు మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పామర్రు: కూరగాయల ధరలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. నెలరోజులుగా ఉల్లి ధర కిలో రూ.50 పలుకుతుండగా, వారంరోజులుగా కూరగాయల ధరలు కూడా అమాంతం పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఉల్లి నిల్వలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసినప్పటికీ ఉల్లి ధరలు మాత్రం తగ్గడం లేదు. నియోజకవర్గంలోని పామర్రు మండలంలో రైతులు 350ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తుండగా, తోట్లవల్లూరు మండలంలో 600ఎకరాల్లో, పెదపారుపూడి మండలంలో 150ఎకరాల్లో, మొవ్వ మండలంలో 150ఎకరాల్లో, పమిడిముక్కల మండలంలో 450ఎకరాల్లో రైతులు కూరగాయలను సాగుచేస్తున్నారు. ఇలా నియోజకవర్గంలోని వందలాది ఎకరాల్లో కూరగాయలు పండుతున్నప్పటికీ స్థానికంగా ధరలు ఏమాత్రం తగ్గకపోతుండటంపై పామర్రువాసులు మండిపడుతున్నారు.

అందుబాటులో లేని ధరలు..

ప్రస్తుతం ఉల్లి సరసన నేనున్నానంటూ క్యారెట్ కూడా చేరింది. మార్కెట్‌లో గురువారం క్యారెట్ కిలో రూ.70 పలకింది. గతంలో రూ.30 నుంచి రూ.40 ధర ఉన్న క్యారెట్ ధర ప్రస్తుతం రూ.70కు చేరడం, బీరకాయ సైతం కిలో ధర రూ.50 నుంచి రూ.60పలుకుతుండటంతో వినియోగదారులకు నోటమాట రావటం లేదు. బీన్స్ ధర ఏకంగా రూ.110 పలుకుతోంది. చికెన్ ధరలా కూరగాయలు రేటు కూడా అమాంతం పెరుగుతుండటంతో ఇతర గృహ అవసరాలకు ఇంకెంత ఖర్చు పెట్టాలని ప్రజలు వాపోతున్నారు. మార్కెట్‌లో దొండకాయలు, బెండకాయలు, వంకాయలు మాత్రమే కేజీ రూ.40 నుంచి రూ.45 పలుకుతుండగా, మిగిలిన అన్నిరకాల కూరగాయల ధరలు కేజీ రూ.50పైమాటే. ఇలా ధరలు రోజురోజుకు పెరుగుతుండటంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గృహిణులు డిమాండ్ చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పామర్రు ప్రజలు కోరుతున్నారు.

పామర్రు మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి..

కూరగాయలు	కిలో ధర
బీన్సు	రూ. 130
కాకరకాయలు	రూ. 65
బీట్‌రూట్	రూ. 60
టమాటా	రూ. 65
పచ్చిమిరప	రూ. 80
బీరకాయలు	రూ. 60
చిక్కుడు	రూ. 60
క్యారెట్	రూ. 70
కాలీఫ్లవర్	రూ. 60
వంకాయలు	రూ. 45
బెండకాయలు	రూ. 45
దొండకాయలు	రూ. 40

కొనలేకపోతున్నాం...

కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో కొనలేకపోతున్నాం. కూరగాయల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యే చర్యలు తీసుకోవాలి.

రాణి, బల్లిపర్రు

ధరలు తగ్గించాలి...

వ్యాపారులే కృత్రిమ కొరత సృష్టిస్తూ కూరగాయల ధరలు పెంచుతుండటంతో ఇబ్బందిపడుతున్నాం. ప్రభుత్వం స్పందించి అటువంటి వ్యాపారులపై చర్యలు తీసుకుని ధరలు తగ్గేలా చూడాలి.

వెంకటమ్మ, పామర్రు

ఎమ్మెల్యేను కలిసిన రెవెన్యూ అధికారులు



ఎమ్మెల్యేను అభినందిస్తున్న తహసీల్దార్ శ్రీపల్లవి, రెవెన్యూ అధికారులు

పామర్రు: రెవెన్యూశాఖ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. ఎమ్మెల్యేను స్థానిక రెవెన్యూ అధికారులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కుమార్‌రాజా మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను రెవెన్యూ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ శ్రీపల్లవి, రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈకేవైసీ పనుల పరిశీలన



పెరికెగూడెంలో ఈకేవైసీ చేయిస్తున్న ఏడీఏ వెంకటమణి, ఏవో జరీనా

మండవల్లి: వీఏఏలు రైతులతో చేయించాల్సిన ఈకేవైసీ, మట్టినమూనాల సేకరణ వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఏడీఏ జి.వెంకటమణి, ఏవో ఎస్‌కే జరీనా సూచించారు. మండలంలోని పెరికెగూడెం, కానుకొల్లు గ్రామాల్లో వీఏఏలు చేస్తున్న ఈకేవైసీ పనులను గురువారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వీఏఏలకు కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులు వరి విత్తనాలను తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి ద్వారా నెలరోజుల వరకు వరి పంటను పురుగులు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి మండలంలో...

ముదినేపల్లి రూరల్: పీఎం కిసాన్ పరిశీలన ప్రక్రియ త్వరితగతిన నూరుశాతం పూర్తిచేయాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి సూచించారు. మండలంలోని పెయ్యేరు, దాకరం, సింగరాయపాలెం రైతుభరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పీఎం కిసాన్ పరిశీలన కార్యక్రమాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఇప్పటివరకు 45 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయినట్లు గుర్తించారు. ఈకేవైసీని త్వరితగతిన నూరుశాతం పూర్తిచేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా సహకరించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



ఎమ్మెల్యే కుమార్‌రాజాకు బుద్ధుడి విగ్రహాన్ని బహూకరిస్తున్న నాయకులు

పామర్రు: ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన నివాస గృహంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కేకును కట్‌చేసి ఎమ్మెల్యే కుమార్‌రాజాకు తినిపించారు. స్థానిక పాలశీతల కేంద్రం కల్యాణ మండపంలో బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు వల్లూరిపల్లి గణేష్, జి.లక్ష్మీదాసు,, కోటి పాండురంగారావు, ఎం.శంకరబాబు, జి.వెంకటేశ్వరరావు, పామర్తి విజయ్‌శేఖర్, కె.చెన్నారాయుడు, పారిపిరెడ్డి శ్రీహరి, మిరియాల హరినాథ్‌బాబు, సందీప్, శ్రీనివాసరావు, జన్ను శోభన్‌బాబు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

హ్యాపీ హోంలో..

పెదపారుపూడి: స్థానిక హ్యాపీ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. భూషణగుళ్ళ గ్రామానికి చెందిన సురేష్ స్పన్‌పైప్స్ అధినేత సురేష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పంచిపెట్టారు. వృద్ధులకు ఆహారపొట్లాలను పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేకు ఘనసత్కారం.

పమిడిముక్కల: ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జన్మదినాన్ని పురస్కరించుకుని మండల టీడీపీ నాయకులు గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆయన్ను సత్కరించినవారిలో రాజులపాటి శ్రీనివాసరావు, నాదెళ్ల సుబ్రమణ్యం, జక్కా శ్రీనివాసరావు, యండూరి పిచ్చేశ్వరరావు ఉన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ



నందివాడ: మండలంలోని తుమ్మలపల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాజీముఖ్యమంత్రి ఎన్టీ రామరావు విగ్రహాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. టీడీపీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచి రాధాకృష్ణ, టీడీపీ నాయకులు తొలుత ఎమ్మెల్యే రాముకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామసెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఎమ్మెల్యే రాము నివాళులర్పించారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీగా ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు నూరుశాతం ప్రజలకు అందించేలా శక్తి వంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, సీనియర్ నాయకుడు పిన్నమనేని బాబ్జి, నందివాడ మండల నాయకులు, తుమ్మలపల్లి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కైకలూరు టౌన్ హాలు వద్ద నిలిచిన వర్షపునీరు



డ్రైనేజీల్లో కదలని నీరు



బురదకయ్యగా మారిన రహదారి

కైకలూరు: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో కైకలూరులోని లోతట్టు ప్రాంతలు జలమయమయ్యాయి. డ్రైయిన్లు పొంగిపొర్లుతున్నాయి. పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై పలు కూడళ్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. రహదారిపై గుంతల్లో నీరు చేరడంతో వాటిని గమనించక పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. కైకలూరు టౌన్ హాలులోకి వర్షపునీరు భారీగా చేరింది. రహదారులు బురదకయ్యలుగా మారాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్, వెలంపేట ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయిన్లలో చెత్తను తొలగించేపనులు చేపట్టారు.

పూడికతీత పనుల ప్రారంభం



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో డ్రెయినేజి వ్యవస్థ ప్రక్షాళన చేసి, మెరుగుపరుస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. స్థానిక పాత కంకిపాడు రోడ్ డ్రెయినేజీలో పూడిక తీసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 19, 20, 23, 24వార్డుల్లో రూ.7.88 లక్షల నిధులతో పూడికతీసే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పట్టణంలో ఏ ప్రాంతంలోనూ మురుగునీరు నిల్వ ఉండకుండా త్వరలోనే బృహత్తర కార్యక్రమం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో-2 పద్మవాణి తదితరులు

పామర్రు: విద్యతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని పామర్రు ఎంఈవో-2 పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక కంచర్లవానిపురంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలని పిలుపునిచ్చారు. చదువు మానేసి ఇళ్ల వద్దే ఉంటున్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బిటీవీ లక్ష్మీకుమారి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె ఏసురత్నం, సీహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఎం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు పెరగడం విచారకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలతోపాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సామాన్యులకు నెలకు 20 రోజులు కూడా పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పెరుగుతున్న ధరలు వారికి అధికభారంగా మారాయన్నారు. ఈ ధరలను భరించే స్థితిలో వారు లేరని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పి.రజిని, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో విస్తృత అవకాశాలు



మాట్లాడుతున్న కృష్ణకాంత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డిజిటల్ మార్కెటింగ్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని రైజన్ సాఫ్ట్ టెక్నాలజీ లిమిటెడ్ ఎండీ విష్ణుభొట్ల కృష్ణకాంత్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజిటల్ మార్కెటిగ్ – అవశ్యకత – అవకాశాలు' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన విష్ణుభోట్ల కృష్ణకాంత్ మాట్లాడుతూ సాంకేతికతపై పట్టు ఉండి సృజనాత్మకత, విశ్లేషణాత్మక సామర్థ్యాలను కలిగిన వారు అద్భుతమైన అవకాశాలను పొందవచ్చన్నారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. కాలానుగుణంగా పోటీ పడుతూ ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత ప్రపంచం డిజిటల్ మార్కెటింగ్ దిశగా పరుగులు తీస్తోందని వివరించారు. ఆ దిశగా విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను పదును పెట్టి అందులోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక విప్లవం అనేక అవకాశాలను అందిస్తోందన్నారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి పి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు హుండీల లెక్కింపు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శనివారం లెక్కిస్తామని ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య గురువారం తెలిపారు. దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆయా ఆలయాలకు చెందిన మేనేజర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని వివరించారు.

హెలెన్ కెల్లర్ జీవితం దర్శనీయం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీడబ్ల్యూబీడీ (దివ్యాంగ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 'హెలెన్ కెల్లర్' 144వ జయంతిని గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ చైర్మన్ రామకృష్ణ పాల్గొని హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దివ్యాంగ ఉద్యోగులు తమలో దాగి ఉన్న ప్రతిభతో రైల్వేకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. దివ్యాంగ ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో తమ వ్యక్తిగతంతో పాటు రైల్వే అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా దిశానిర్దేశం చేశారు. అనంతరం ఈ నెలలో పదవీవిరమణ చేయనున్న దివ్యాంగ ఉద్యోగులు మహాలక్ష్మి, సురేష్ బాబు, నాగరాజులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పర్సనల్ బ్రాంచ్ ఏపీఓ అనురాధ మాట్లాడుతూ సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ సారథ్యంలో వినూత్న మార్గాల ద్వారా దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించామన్నారు. అందుకోసం తనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంగ్ విజయవాడ డీఎస్ ఆమంచి వెంకటేశ్వరరావు, ఆర్ఎంయూ ఏడీఎస్ శేఖర్‌బాబు, అసోసియేషన్ డీఎస్ శివకుమార్, జగదీష్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

దౌర్జన్యకాండ పునరావృతం కాకుండా తీర్మానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న బయట వ్యక్తులు చేసిన దౌర్జన్యకాండ భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునే నిమిత్తం పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వార్డు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ.. గ్రామ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా పంచాయతీ కార్యాలయంలో బయట వ్యక్తులు వీరంగం సృష్టించడం దారుణమన్నారు. గ్రామ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో అత్యవసర సమావేశం నిర్వహించి పాలకవర్గ సభ్యులచే తీర్మానించామని చెప్పారు.